

విద్యార్థినిచే జీసీడీవోతో ఫోన్‌లో మాట్లాడిస్తున్న ప్రిన్సిపాల్ ఫాతిమా


నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I హైదరాబాద్, మంగళవారం 19 నవంబర్ 2024 RANGAREDDY


### ఆగని పోలీసుల ఓవరాక్షన్..

లగచర్ల ఘటన అనంతరం అర్ధరాత్రి దాడి చేసిన వారి కోసం గాలింపు చేపట్టి తండాల్లోని గిరిజన మహిళలు, వృద్ధులు, చిన్నారులను భయభ్రాంతులకు గురి చేసిన పోలీసులు ఇంకా అమాయక గిరిజనుల పట్ల దౌర్జన్యంగా వ్యవహరిస్తున్నారు. లగచర్ల ఘటన అనంతరం లగచర్లతోపాటు రోటిబండతండా, పులిచర్ల తండాల్లో పోలీసులు పహారా కాస్తున్నారు. సోమవారం జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు పర్యటన సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలంతటా పోలీసులు భారీగా మొహరించారు. లగచర్ల వైపు వెళ్లే ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన పోలీసులు రెండు, మూడు గంటలపాటు మీడియా వాహనాలతోపాటు ఎవరి వాహనాలనూ లగచర్లకు అనుమతివ్వకుండా అత్యుత్సాహం ప్రదర్శించారు. లగచర్ల గ్రామం మొత్తాన్ని పోలీసులు ఓవరాక్షన్ చేస్తూ దిగ్బంధించారు. గిరిజనులకు అండగా నిలిచేందుకు వస్తున్నారనే సమాచారంతో జిల్లా వ్యాప్తంగా గిరిజన నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్ట్ చేశారు. జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడి వెంట ఎస్పీతోపాటు నలుగురు డీఎస్పీలు, పది మంది సీఐలు, డజనుకుపైగా ఎస్ఐలతోపాటు భారీ మొత్తంలో పోలీసులు లగచర్లకు వచ్చారు. మరోవైపు లగచర్ల ఘటనలో పోలీసుల వైఫల్యంపై అధికారులపై వేటు మొదలైంది.

# ఆరు నెలలైనా అధ్యాపకులేరి..?

**ఆందోళనకు దిగిన పూడూరులోని కస్తుర్బా గాంధీ గురుకుల పాఠశాల ఇంటర్మీడియట్ విద్యార్థినులు**

**అధ్యాపకులను నియమించకుంటే మా సర్టిఫికెట్లు మాకివ్వండి అంటూ అభ్యర్థన**

పూడూరు, నవంబర్ 18 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ప్రారంభం నుంచి సరైన అధ్యాపకులు లేక పాఠ్యాంశాలు పూర్తికాకపోవడంతో ఇంటర్మీడియట్ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. అధ్యాపకులను నియమించాలని ఉన్నతాధికారులను పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనలేదని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గురుకులంలో ఇంటర్మీడియట్ ఫస్ట్, సెకండియర్‌లలో బైపీసీ, ఎంపీసీ కోర్సులు మాత్రమే ఉన్నాయి. ఈ కోర్సుల్లో మొదట్లో 82 మంది అడ్మిషన్ అవగా.. సరైన అధ్యాపకులు లేరని 12 మంది విద్యార్థినులు సర్టిఫికెట్లు తీసుకుని వెళ్లారు. ప్రస్తుతం ఫస్టియర్‌లో 52 మంది, సెకండియర్‌లో 26 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. ప్రారంభం నుంచి తెలుగు, బాటనీ, జువాలజీ సబ్జెక్ట్‌ల అధ్యాపకులు మాత్రమే ఉండగా.. ఇతర సబ్జెక్ట్‌ల అధ్యాపకులు మొదటి నుంచి లేరని.. వారిని వెంటనే నియమించాలని సోమవారం విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు గురుకులం ఎదుట ఆందోళనకు దిగారు. రెండు నెలలైతే ఫైనల్ పరీక్షలు వస్తాయని.. తమకు సబ్జెక్టులు బోధించేవారు లేనప్పుడు ఎలా పరీక్షలు రాస్తామని విద్యార్థినులు రోదిస్తూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అధ్యాపకులను నియమించాలంటూ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేస్తున్న విషయాన్ని ప్రిన్సిపాల్ ఫాతిమా జీసీడీవో శ్రీదేవికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. మంగళవారం గురుకులాన్ని సందర్శించి సమస్యలను పరిష్కరిస్తామని జీసీడీవో తెలిపినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కేజీబీవీని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్, కార్యదర్శి సతీశ్ సందర్శించి విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే అన్ని సబ్జెక్టుల లెక్చరర్లను నియమించాలని వారు డిమాండ్ చేశారు.

# జీతాలు చెల్లించండి..

**ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉంటే మేము ఎలా జీవిస్తాం**

**మధ్యాహ్న భోజన నిర్వాహకులు**

బంట్వారం, నవంబర్ 18 : ఆరు నెలలుగా జీతాల్లేకుంటే తాము ఎలా బతకాలని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీతాలు చెల్లించాలని వికారాబాద్ జిల్లా బంట్వారం మండలంలోని స్థానిక మాడల్ స్కూల్‌లో పని చేస్తున్న రాధ, అనురాధ, బందయ్యలు సోమవారం ఎంఈవో కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో ఎంఈవో అందుబాటులో లేకపోవడంతో కొద్దిసేపు అక్కడ బైఠాయించారు. వారిని స్థానిక విలేకరులు ప్రశ్నించగా..ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో స్థానిక మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌ను అడిగితే.. తనకు తెలియదని ఎంఈవో కార్యాలయానికి వెళ్లాలని సూచించడంతో ఇక్కడికి వచ్చినట్లు వారు చెప్పారు. ఈ విషయమై ఎంఈవో వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని.. మండలంలో సుమారు 36 మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. త్వరలోనే జీతాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



బంట్వారం ఎంఈవో కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహకులు



జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడితో లగచర్ల రైతు కుటుంబాల మహిళలు

## లగచర్ల గిరిజనులకు
# ఎస్టీ కమిషన్ అండ

**అర్ధరాత్రి గిరిజన మహిళలపై పోలీసుల తీరుపై ఆగ్రహం**

**భూసేకరణలో ప్రభుత్వ తీరును తప్పుబట్టిన ఎస్టీ కమిషన్**

**లగచర్లలో జరిగిన దారుణాన్ని ఎస్టీ కమిషన్‌కు తెలిపిన గిరిజన మహిళలు, చిన్నారులు**

**అరెస్ట్‌లు ఆపకపోతే కమిషన్‌పరంగా చర్యలుంటాయని హెచ్చరించిన సభ్యుడు జాటోతు హుస్సేన్**

వికారాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైన లగచర్ల ఘటనలో అమాయక గిరిజనులకు జాతీయ ఎస్టీ కమిషన్ అండగా నిలిచింది. అధికారులపై తిరగబడిన ఘటన అనంతరం గిరిజన మహిళలు, వృద్ధులు, చిన్నారులపై పోలీసులు వ్యవహరించిన తీరును జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్‌కు గిరిజన మహిళలు తమ గోడును తెలిపారు. ఘటనా స్థలంలో లేనివాళ్లను పోలీసులు తీసుకెళ్లారని, పోలీసుల భయానికి తండాల్లో మగవాళ్లు లేకుండా తండాలను వదిలి వెళ్లారని, ఎక్కడ ఉన్నారో కూడా తెలియదని, వారం రోజులుగా తండాల్లో చిన్నపిల్లలను అక్కున చేర్చుకొని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నట్లు తెలిపారు. ఎప్పుడు, ఎవరు వస్తారో, ఏం జరుగుతుందోనన్న భయంతో తిండి, నిద్రలు మానేసి బతుకుతున్నామని కమిషన్ సభ్యుడికి వెల్లడించారు. ఎంసెట్‌లో సీటు వచ్చినా ఫీజు చెల్లించేందుకు డబ్బులు లేకపోవడంతో చదువులకు దూరం అవుతున్నట్లు తండాలకు చెందిన విద్యార్థులు ధైర్యంగా ఎస్టీ కమిషన్ సభ్యుడికి తెలిపారు. వారి గోడును విన్న జాటోతు హుస్సేన్ ధైర్యంగా ఉండాలని, అండగా ఉంటామని భరోసానిచ్చారు. అర్ధరాత్రి అమానవీయంగా వ్యవహరించిన పోలీసుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతవరకు చేసిన అరెస్టులు చాలని, ఇకపై అరెస్టులు చేయొద్దని, అరెస్టులు ఆపకపోతే కమిషన్‌పరంగా చర్యలుంటాయని ఆయన పోలీసులను హెచ్చరించారు. భూసేకరణ విషయంలో ప్రభుత్వ తీరును ఆయన తప్పుబట్టారు. ప్రజాభిప్రాయాలను గుర్తించి నచ్చజెప్పేలా ముందుకెళ్తే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని, ఎన్నో ఏండ్లుగా ఆ భూములను సాగు చేసుకుంటూ బతుకుతున్న వారు భూములను వదులుకోవడానికి సిద్ధంగా లేరనేది స్పష్టమవుతున్నదని, ప్రజాభీష్టానికి అనుగుణంగా నడుచుకోవాలని, బలవంతంగా భూములు లాక్కునే ప్రయత్నం చేయవద్దని ఎస్టీ కమిషన్ సభ్యుడు సూచించారు.



కన్నీటిపర్యంతమవుతున్న లగచర్ల బాధిత మహిళలు



వైద్యులు లేక ఆస్పత్రిలో నిరీక్షిస్తున్న రోగులు

## అందని వైద్యం..
# రోగుల దైన్యం

- అయోమయంలో అప్‌గ్రేడ్ ఆస్పత్రులు
- సరిపడా వైద్యుల్లేరు.. వసతులు అంతంతే
- తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రోగులు
- పట్టించుకోని వైద్యవిధాన పరిషత్ అధికారులు

*జిల్లాలోని పలు ఏరియా ఆస్పత్రులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం డీఎంహెచ్‌వో పరిధి నుంచి అప్‌గ్రేడ్ చేయగా.. వైద్యవిధాన పరిషత్ ఆధీనంలోకి తీసుకున్నారు. పడకల సామర్థ్యాన్ని కూడా 30 నుంచి 50కి పెంచారు. అయితే ప్రభుత్వం మారడంతో ఆ దవాఖానల్లో సరిపడా వైద్యుల్లేక, పరికరాలు, వసతులు అందక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోగులకు నర్సులే చికిత్స అందిస్తుండడంతో ఆ వైద్యశాలలకు వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు.*

*- రంగారెడ్డి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ)*

### అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రులు..

జిల్లాలోని ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, హయత్‌నగర్, యాచారం, శంషాబాద్‌లోని ఏరియా ఆస్పత్రులను గత ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లుగా పేర్లు మార్చి వైద్యవిధాన పరిషత్ ఆధీనంలోకి తీసుకున్నది. అయితే అప్‌గ్రేడ్ అయిన దవాఖానల్లో గైనకాలజిస్టు, మత్తు, పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్, రేడియాలజిస్టు, చెవి, ముక్కు, కంటి వైద్యులు, అవసరమైన థియేటర్లు, నర్సులను కేటాయించాల్సి ఉండగా.. వారిలో ఒక్కరినీ వైద్య విధాన పరిషత్ కేటాయించలేదు. అలాగే, సరైన మందులు కూడా పంపిణీ చేయకపోవడంతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. గైనకాలజిస్టులు లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, కాన్పుల కోసం వచ్చే వారు కూడా తగ్గిపోయారు.



ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రి..

### శిథిలావస్థకు చేరిన భవనాలు..

జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రులు శిథిలావస్థకు చేరాయి. ఇబ్రహీంపట్నం, యాచారం, ఆమనగల్లు, హయత్‌నగర్, శంషాబాద్ ఆస్పత్రుల భవనాలను గత 30 ఏండ్ల కిందట నిర్మించారు. ఈ దవాఖానల్లో సాగు నీటి సౌకర్యం లేదు. డ్రైనేజీ వ్యవస్థ కూడా అస్తవ్యస్తంగా ఉన్నది. ఆపరేషన్ థియేటర్లూ సరిగ్గా పనిచేయడం లే దు. దీంతో ఈ దవాఖానల్లో నూతన భవనాలను నిర్మిస్తామని చెప్పి ఇప్పటివరకు వాటి ఊసేలేదు. అలాగే ఈ ఆస్పత్రులను డీఎంహెచ్‌వో, వైద్య విధాన పరిషత్‌కు సంబంధించిన అధికారులెవరూ కన్నెత్తి చూడకపోవటంతో .. వైద్యులు, ఇతర సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో...ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. రోగులు మాత్రం గంటల తరబడి నిరీక్షిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.





యాచారం ప్రభుత్వ ఆస్పత్రి..

### డాక్టర్లు ఎప్పుడు వస్తున్నారో... ఎప్పుడు పోతున్నారో తెలియడంలేదు



అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రులపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో...ఎప్పుడు పోతున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. వైద్యంకోసం వచ్చిన రోగులు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తున్నది. కొన్ని సందర్భాల్లో నర్సులే చికిత్స అందిస్తున్నారు. దీంతో చాలామంది రోగులు ఈ దవాఖానలకు వచ్చేందుకు జంకుతున్నారు.

-రవీందర్, యాచారం..

### మెరుగైన వైద్యం అందించాలి..



బీఆర్ఎస్ ప్రభుత్వం సర్కారు దవాఖానల స్థాయిని పెంచడంతోపాటు నిధులు కూడా విడుదల చేసింది. అయితే ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రావడంతో పేదలకు మెరుగైన వైద్యం అందడంలేదు. వైద్యులు, సిబ్బంది ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. నర్సులే చికిత్స అందిస్తుండడంతో రోగులు భయపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలి.

-జెర్కోని రాజు, ఇబ్రహీంపట్నం


# కాంగ్రెస్‌లో కయ్యం

## ఎమ్మెల్యే కాలె యాదయ్యపై భగ్గుమంటున్న కాంగ్రెస్ నాయకులు

**పోలీస్ బందోబస్తు మధ్య నవాబుపేట మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం**

- **అనుయాయులకే పదవులు కట్టబెట్టి సీనియర్లకు అన్యాయం చేస్తున్నారని మండిపాటు**

నవాబుపేట, నవంబర్ 18 : వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం గప్‌చుప్‌గా సాగడంతో మండలంలోని పలువురు కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులు ఉండడంతో పోలీసుల బందోబస్తు పెట్టుకుని మరీ ప్రమాణ స్వీకారం చేశారని హస్తం పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ జెండాపై గెలిచి.. కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య పార్టీ కోసం కష్టపడ్డ వారికి అన్యాయం చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ నవాబుపేట మండల ఉపాధ్యక్షుడు మినపల్లి శివప్రసాద్ అన్నారు. సీనియర్ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా.. ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి మార్కెట్ కమిటీ పదవులను కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కొన్నేండ్లుగా పనిచేస్తున్న వారికి మొండిచేయి చూపడంతో సీనియర్లు గుర్రుగా ఉన్నారు.



ప్రమాణస్వీకారం అనంతరం నవాబుపేట నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ

# ముగిసిన గ్రూప్-3 పరీక్షలు

**ఉమ్మడి జిల్లాలో రెండోరోజూ హాజరు శాతం అంతంతే..**

**పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన వికారాబాద్ కలెక్టర్**

రంగారెడ్డి, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో గ్రూప్-3 పరీక్షలు ముగిశాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో మొదటి రోజు నిర్వహించిన పరీక్షలకు 60 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. సోమవారం రంగారెడ్డి జిల్లాలో జరిగిన పరీక్షకు 61 శాతం మంది అభ్యర్థులు హాజరుకాగా.. వికారాబాద్ జిల్లాలో.....59.42 శాతం మంది పరీక్ష రాశారు. అధికారులు పరీక్షలను పకడ్బందీగా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని కేంద్రాల్లో సోమవారం పరీక్ష ముగియగానే అభ్యర్థుల పరీక్ష పత్రాలను బందోబస్తు మధ్య నగరానికి తరలించారు. పరీక్షలను రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి నేతృత్వంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇతర జిల్లా అధికారులు, పోలీసు అధికారులు పర్యవేక్షించారు. అదేవిధంగా వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ కూడా పలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ తదితరులు ఉన్నారు.



పూడూరులోని పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్